కథా నిలయం
శ్రీకాకుళం



# ముగింపు మీరే చెప్పండి !

**భారంగా** నిట్టూర్చి ఒత్తిగిలి పడుకున్నారు మహేంద్ర భూపతి. కళ్ళు తెరిచినా, మూసినా కనబడేది చీకటే ! చిందర వందరగా ముసురుకొంటున్న ఆలోచనల తెమ్మెర. జీవం లేని కళ్ళలో కనిపించని ఆశ.

వృద్ధాప్యం పైన పడుతున్న తనకు భగవంతుడు ఎందుకీ శిక్ష విధించాడు? కారు ప్రమాదంలో తను చనిపోయినా బాగుండేది. కళ్ళు తీసుకుని తన బ్రతుకు చీకటిమయం చేశాడు ఆ రాతి దేవుడు.

రేపు?... రేపటి గురించి తలుచుకొంటే ఆయన హృదయంలో ఆనందపు కెరటం ఎగిసిపడింది. రెండు సంవత్సరాలుగా కారుచీకట్లో మ్రగ్గుతున్న తన అంధకార జీవితానికి 'రేపు' ఒక వెలుగు రేఖ. రేపే తనకు ఆపరేషన్ ! తనకు చూపు వస్తుంది. చూపొస్తే...

క్షణకాలం ఆయన ఆనంద ప్రవాహానికి ఆనకట్ట పడింది. "చూపొస్తే ముందుగా ఎవర్ని చూడాలి?" మనుషుల్లో దైవత్వం ఇంకా నశించిపోలేదు.

తనకు అహోరాత్రులు సేవ చేసిన భార్య అరుంధతి, దేశంలో ఆసుపత్రులన్నీ తిరిగి తనకు కళ్ళు తెప్పించటానికి ఆరాటపడ్డ ప్రాణ మిత్రుడు మాధవరావు, నేత్రదానం చెయ్యబోతున్న దంపతులు, క్లిష్టమైన ఆపరేషన్ చెయ్యబోతున్న డాక్టర్ మనోహర్...

వీళ్ళందరూ దైవత్వానికి ప్రతిబింబాలే !

అరుంధతి ! ఎన్ని పూజలు చేసిందో ! ఆమె మాంగల్యబలం వల్లే తను ప్రమాదంలోంచి తప్పించుకుని, తిరిగి దృష్టిని పొందగలుగుతున్నాడేమో ! ఆలోచనల్లోంచి నిద్రకి ఒరిగిపోయాడు. ఆయన కనురెప్పలు మూతపడ్డాయి.

★ ★ ★

భర్త కనురెప్పలు మూతపడ్డంతో ఈజీఛెయిర్‌లో విశ్రాంతిగా వెనక్కి వాలింది అరుంధతి. అంతవరకు పొంచి ఉన్న ఆలోచనలు ఆమెను చుట్టుముట్టాయి.

'కొద్ది రోజుల్లో ఆయనకు చూపు వస్తుంది. నిజంగా వస్తుందా ? ఏమో! భర్తపట్ల ప్రపంచంలోని ఏ భార్యా ప్రవర్తించనంత క్రూరంగా తను ప్రవర్తించింది. తన భర్తకు చూపు రాకుండా చేస్తే రెండు లక్షలిస్తానంది. డాక్టర్ విని ఊరుకున్నాడు. ఏం చేస్తాడో, ఏమో !'

అరుంధతిలోని ఆలోచనలు వికృతంగా రెక్కలు విప్పుకొని ఎగిరాయి. భర్తకు చూపు రాకపోతే తిరిగి ఎస్టేట్‌కి వెళ్ళిపోవచ్చు. అక్కడ మేనేజర్ రాజేష్ ఒడిలో వెచ్చగా పరువాన్ని పండించుకుంటూ...

హాస్పిటల్‌కి రాకముందు రోజు రాజేష్ గదిలో... బలంగా తనని గుండెలకేసి హత్తుకున్నాడు రాజేష్. గాట్లు పడేలా పెదవుల్ని కొరకొద్దని తను ఎంత చెప్పినా వింటేనా? 'ఆ గుడ్డివాడికేం తెలుస్తుందిలే' అంటాడు. అయితే మాత్రం... పనివాళ్ళ దృష్టిలో తను చులకనయిపోదూ !

మనసు రాజేష్ ఊహలతో తియ్యగా మూల్గుతోంది. రాజేష్ ఎంత అందంగా, సుకుమారంగా ఉంటాడు ! ఈ మధ్యనే పాడు బ్రాందీ, విస్కీ అలవాటు చేసుకున్నాడు. అయితే ఏం ? తను పొందుతున్న అనుభూతి ముందు ఈ అలవాటును సహించలేదా ?

బెడ్ మీద భర్త కదలటంతో ఆమె ఊహలకి అడ్డుగోడ పడింది. క్షణం సేపు భర్త వంక చూసి తిరిగి ఆలోచనలో పడింది అరుంధతి. భర్తను చూస్తుంటే ఆమె హృదయంలో లావాసెగలు కక్కుతున్నట్టుంది. "ఏదో దూరపు బంధువుల పెళ్ళిలో తనను చూసి పెళ్ళి చేసుకోవటానికి అంగీకరించాడు. ఏభై ఏళ్ళ మహేంద్రభూపతి. అమ్మా నాన్నా గత్యంతరం లేక అతనికిచ్చి పెళ్ళి చేశారు. అందరూ తనని అదృష్టవంతురాలనే అన్నారు. ఏమిటి తన అదృష్టం? పాతికేళ్ళ పరువంలో ఉన్న తనని ఏభై ఏళ్ళ ముసలివాడు

భార్యగా స్వీకరించటమా? అతని వెనక ఉన్న కోట్ల రూపాయల ఆస్తికి తను అధికారిణి కావటమా...?

భూపతితో తనేం సుఖపడింది ? పురాణాలు చదువుకుంటూ అతనికున్న గుండె జబ్బుని, డయాబెటిస్‌ని జాగ్రత్తగా కాపాడుకోవడంతోనే అతను తన జీవితాన్ని గడుపుతున్నాడు. తనకేం సుఖం మిగిలింది ? ధర్మార్థ కామ మోక్షాలలో తనతో సమంగా ఉంటానన్న భర్త తనతో ఏం పంచుకున్నాడు ఒక 'అర్థం' తప్ప? ఆ డబ్బుతోనే ఈ లోకాన్ని ఓడించి తన సుఖాన్ని తను గెల్చుకోవాలి. రాజేష్‌తో తన బ్రతుకు పండించుకోవాలి! ఆ మాధవరావొకడు స్నేహితుడి కళ్ళ కోసం విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు. నిజంగా మానవత్వం మూర్తీభవించిన మనిషి మాధవరావు. ఈ రోజుల్లో స్నేహంకోసం పాకులాడే వాళ్ళెందరు ?

★★★

బాల్కనీలో నిలబడి చూస్తున్నాడు మాధవరావు. ఎదురుగా గేటు దగ్గర చిరుగాలికి అందంగా తలలూపుతున్న బోగన్‌విల్లాల కేసి, రోడ్డుమీద జోరుగా పోతున్న వాహనాల కేసి చూడటం లేదు. రోడ్డు పక్కన మర్రిచెట్టు క్రింద తత్వాలు పాడుకుంటున్న కుంటి బిచ్చగాడు రాజయ్యని, వాడిపెళ్ళాం లక్ష్మిని చూస్తున్నాడు.

లక్ష్మితో తను క్రిందటి రోజు సాయంత్రం మాట్లాడాడు. పదివేలు ఇస్తే కళ్ళను మహేంద్ర భూపతికి దానంగా ఇవ్వటానికి అంగీకరించింది.

తను కళ్ళ ఆపరేషన్ కోసం మూడు లక్షలు ఖర్చు పెడుతున్నట్టు భూపతిగారితో చెప్పాడు. ఎలా చూసినా, ఈ వ్యవహారంలో తనకు ఒక లకారం దాకా మిగులుతుంది. దానితో కొడుకు డాక్టరీ చదువు, కూతురి పెళ్ళి అయిపోతాయి. మాధవరావు మనసు దూదిపింజెలా ఎగురుతూంది.

తను మహేంద్ర భూపతిగారికి అన్యాయం చేస్తున్నాడా? ఈ ఆలోచన రావటంతో మాధవరావు మనసు కలవరపడింది. లేదు ! లేదు ! అతని హృదయం వెర్రిగా అరిచింది. తన కొడుకు పెద్ద హోదాలో ఉండాలి. కూతురు ఏ ఇంజనీర్నో కట్టుకుని సుఖపడాలి. తండ్రిగా తన పిల్లల క్షేమం కోరుకోవటం తప్పుకాదు. తను మానవత్వపు విలువలకి ద్రోహం చేస్తున్నాడు. నిజమే ! తను మహోన్నతుడు కాదు. కాని, నిన్ననే మానవత్వపు మహోన్నత శిఖరాల్ని కూడా అవహేళన పరచేటంత ఉన్నత మనస్తత్వాన్ని ఒక సామాన్య స్త్రీలో చూశాడు తను. తన పసిపిల్లల జీవితాన్ని సుగమం చెయ్యటానికి తన కళ్ళనే

త్యాగం చెయ్యటానికి సిద్ధపడిన ప్రేమమయి కుంటి బిచ్చగాడు రాజయ్య భార్య లక్ష్మి. ఆ త్యాగశీలి ముందుతనెంత? మాధవరావు కళ్ళు లక్ష్మి వైపు తదేకంగా చూస్తున్నాయి.

★ ★ ★

లక్ష్మి ఆలోచిస్తున్నది. తన బతుక్కి ఇంతకంటే ఎలుగు మరి రాదు. కాలేజీలో సదువుతున్న రాంబాబు సినేమా ఈరోయిన్ని సేస్తానన్నాడు. డబ్బు లేక ఆగిపోనాడు గాని, తనీపాటికి ఈరోయిన్ ఏస్సుండేది, రాంబాబుకి తనంటే ఎంతిష్టం? నువ్వచ్చు జ్యోతిలచ్మీలా ఉంటావే? ఈ మాట తమిద్దరు పడుకున్నప్పుడు ఎన్నిసార్లన్నాడో? తన ఖర్మ బాగులేక ఈ కుంటి రాజయ్యగాణ్ణి కట్టుకుని అందరిళ్ళలోనూ అంట్లు తోముకుంటుంది గాని, తన సేతిలో ధనరేఖ జెర్రిగొడ్డు లాగుంది. అయితేటి? కలిసి రావడం లేదంతే!

రాజయ్య దగ్గడంతో కలల్లో నుంచి బయటపడి మళ్ళీ ఆలోచనల్లో మునిగిపోయింది లక్ష్మి. రాజయ్య మావతో గుంట వెధవ లిద్దరికీ సదువు సెప్పించి పెద్దోళ్ళని సెయ్యటం కష్టమనీ, అందుకు తన కళ్ళమ్మేస్తాననీ సెప్పింది మాట వరసకి. తనకి తెలుసు–మావ అందుకు ఒప్పుకోడు. ఆడి కళ్ళె ఇచ్చేస్తానని పట్టు పట్టాడు. తనకీ అదే కావాలి. ఆ డబ్బుతో తను ఈరోయిన్ అయిపోవచ్చు. ఆలోచన్ల కొట్టు కట్టేసి జాలిగా రాజయ్య వైపు చూసింది లక్ష్మి.

ఆలోచిస్తున్నాడు రాజయ్య. "కళ్ళు పోతేయేం? 'పదివేలు'! సచ్చేదాకా అడుక్కున్నా, తను అంత డబ్బు కూర్చగలడేటి? ఆడబ్బుతో సచ్చేదాక కాలుమీద కాలేసుకుని హాయిగా బతికీవచ్చు. ఈ లచ్మీగుంట ఈ మధ్య ఎదవేసాలు ఏస్తున్నట్టుంది. ఈ గుంటని నమ్మకూడదు. డబ్బంతా తన కాడే ఉంచుకోవాల.

ఆ మహానుభావుడు ఎవరో జమిందారట! కళ్ళకోసం పది ఏలు ఖరుసు పెడతన్నాడు. ఆ బాబుని బతిమాలుకుంటే మరో నాలుగైదు వేలన్నా ఇవ్వాపోడు. పెద్దబాబు! పెద్ద మనసుండకపోద్దా! కాకపోతే డాట్టరు బాబు సేత సెప్పించాలి. డాట్రుబాబు మంచోడు. హాస్పిటల్ లాన్‌కేసి చూశాడు రాజయ్య.

→ → →

లాన్ మధ్యలో ఫౌంటెన్ విరజిమ్ముతున్న నీటితుంపరల్ని గార్డెన్ చెయిర్‌లో కూర్చుని చూస్తూ ఆలోచిస్తున్నాడు డాక్టర్ మనోహర్. ఎదురుగా టీపాయ్ మీద కాఫీ వేడి సెగలు కక్కుతూంది. చేతిలో సిగరెట్ పొగ వలయంలా పైకి లేస్తూంది.

డాక్టర్ మనోహర్ తండ్రి వ్యాపారస్తుడు. లాభసాటిగా ఉంటుందనే కొడుకుని ఎమ్.బి.బి.ఎస్. చదివించాడు. అదృష్టం బాగుండి మంచి పేరు తెచ్చుకున్నాడు మనోహర్. అయితే, పెట్టుబడిదారీ మనస్తత్వం అతని నరనరాల్లోనూ జీర్ణించుకుపోయింది. మనోహర్‌కి ఇప్పుడో చిన్న సమస్య ఎదురైంది. అందుకే ఆలోచన..

మహేంద్రభూపతికి చూపు తెప్పిస్తే రెండు లక్షలిస్తానన్నాడు మాధవరావు. కళ్ళు రాకుండా చేస్తే రెండు లక్షలిస్తానంది అరుంధతి...!

ఒక మనిషి కళ్ళు తీసి భూపతికి చూపొచ్చేటట్టు చేస్తే రెండు లక్షలు. ఏమీ కష్టపడకుండా వూరుకున్నా రెండు లక్షలే ! ఏది లాభసాటి ?

చాలాసేపు ఆలోచించిన తర్వాత ఒక నిశ్చయానికి వచ్చినట్టు తల పంకించాడు మనోహర్. ఉత్సాహంగా లేచి జేబులోంచి రూపాయి నాణెం తీశాడు.

'బొమ్మ పడితే అరుంధతి కోరిక తీరుతుంది. బొరుసుపడితే మాధవరావు గెలుస్తాడు!' నాణెం గాలిలోకి ఎగరేస్తూ అనుకున్నాడు.

నాణెం గాలిలోంచి వచ్చి అతని గుప్పెట్లో పడింది. గుప్పెట తెరిచి చూశాడు. 'బొమ్మ.' చిన్నగా నవ్వుకున్నాడు మనోహర్.

'సారీ! మాధవరావ్! ఐ కాంట్ డూ ఎనీ హెల్ప్ ఫర్ యూ!' తనలో తనే అనుకుంటూ నాణెం రెండో పక్క చూశాడు. అటువైపూ బొమ్మే ఉంది.

మనోహర్‌లో జీర్ణించుకు పోయిన పెట్టుబడిదారీ రక్తానికి ప్రతీక ఆ నాణెం. మూడో అంతస్తులో మహేంద్ర భూపతి గారి గదివైపు జాలిగా చూశాడు మనోహర్.

మూడో అంతస్తులో బెడ్ మీద లేచి కూర్చున్నారు మహేంద్రభూపతి. చీకటి పడిపోయిందా! ఏమో! ఇంకెంత.. ఈ ఒక్క రోజు వోపిక పడితే రేపే ఆపరేషన్. మరో పది రోజుల్లో తను ఈ వెలుగు నిండిన ప్రపంచాన్ని చూడగలడు. పవిత్రంగా ఆలోచనలు. కల్మషం లేని దైవత్వం.

చూపొస్తే ముందుగా ఎవర్ని చూడాలి ?

తనకు అహోరాత్రులు సేవ చేసిన భార్య అరుంధతి, దేశంలో ఆసుపత్రులన్నీ తిరిగి తనకు కళ్ళు తెప్పించడానికి ఆరాటపడ్డ ప్రాణమిత్రుడు మాధవరావు, నేత్రదానం చెయ్యబోతున్న దంపతులు, క్లిష్టమైన ఆపరేషన్ చెయ్యబోతున్న డాక్టర్ మనోహర్ వీళ్ళందరూ దైవత్వానికి ప్రతిబింబాలే!

వీళ్ళలో ఎవర్ని... ఎవర్ని ముందుగా చూడాలి? వెలుతురు నిండిన భూపతి

గారి మనసు స్వేచ్ఛావిహంగంలా ఎగురుతూ ఆలోచిస్తోంది.

★★★

ప్రియమైన పాఠకులూ! మీరు చెప్పండి... మహేంద్రభూపతిగారికి చూపు రావటం అవసరమా? ఆయనకు కళ్ళు వస్తే ముందుగా ఎవర్ని చూడాలి ?

(ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక 7-10-1981)